# కవితా కౌముది

## మరణం లేని పాట

యశస్వి, గుంటూరు



పాట అడ్డంపడి గొంతు పొలమారింది అంతే
కొత్త సిరా తాగితే కోర బోయిన కంఠం
మళ్ళీ రాగాల పల్లకిలో కోయిలమ్మని మోసుకొస్తుంది
పల్లవి గొంతు గొంతులో ప్రవహిస్తూనే వుంటుంది
జీవనదిలో అక్షయ పాత్రలా
అక్షరాల పొదుగులో
రాగాల క్షీరాన్ని పిండి
శృంగార రసాన్ని కలిపి
సినిమా డైరీకి
డైలీ పాటలు పోసిన వేటూరి
తెలుగోళ్ళ గుండె గోడలపై
ఆరేసుకున్న అక్షరాలూ
పారేసుకున్న పదాలు
మళ్ళీ మళ్ళీ వికసిస్తాయి ఆ రోజాలు
మరణం లేని మానస "స్వరో"వరాలు
తెలుగులో
మూర్తీభవించిన రెండక్షరాల పాట
ఘనీభవించిన రెండర్థాల పా(ట)ల సంద్రం
నవతరానికి
"వే" చూపించిన, తెరవెనుక

"టూరి"స్టు సుందరం

రాలిపోయిన పువ్వుకాదు

అజరామర అక్షర యోధుడు

ఆభరణం లేని శంకరుడు ***

## వీడిపోయిన వసంతాలు

ఉమ ఇయ్యుణ్ణి

వంగూరి ఫౌండేషన్ వారు నిర్వహించిన 15వ ఉగాది రచనల పోటీలలో ప్రథమ బహుమతి పొందిన కవిత

(ఇది కేవలం కవిత కాదు, సంప్రదాయాల మీద అగౌరవమూ కాదు, వితండవాదమసలే కాదు. ఇటీవలే కొద్దిమంది సన్నిహితుల జీవితాలలో జరిగిన సంఘటనలకు మనసు చలిస్తే వెలువడిన భావ పరంపర)

బాలార్క కిరణాల పసిడి వెలుగుల వేళ
శుక్రవారపు పొద్దు పసినిసుగు కనులు విప్పిన వేళ
ఇంటింట వెలసేను శ్రీ మహలక్ష్మి
అపరంజి బొమ్మ అది ముద్దుల గుమ్మ!

కేరింతలిడు వేళ కళకళలు తోచేను
పారాడు పసికూన మనసంత నిండేను
తప్పటడుగుల చిట్టితల్లి తాతలకు పండుగ
చిరునవ్వుల చిన్నారికి బామ్మ చంద్రహారాలు దండిగ

అట్లతద్ది కన్నియ తోటివారికి చెలియ
కలువ కన్నుల నెలత చిరునవ్వు విరియ
ప్రకృతి మురిసెనమ్మ, సిరులు కురిసెనమ్మ
కన్నతల్లి మనసు పొంగి పొరలెనమ్మ

నట్టింట నడయాడు అపర శారదా దేవి
మెట్టింట అడుగిడ అదె కాద సౌభాగ్యవతి

ఇరుగింటి పొరుగింటి చెలులు కూడిన వేళ
అయినింటి కోడలు పుణ్యాల రాశి!

తగిన సఖుడు తోడ్పడ వికసించు జీవితము
జన్మజన్మల క్రిందట ముడివడిన బంధము
వొడిన చేర పసిబాలుడు సంతరించె మాతృత్వము
వొడిదుడుకుల సమన్వయమున సమకూరె మానసిక పరిపక్వము

గడుచు వసంతాలు, కడతేరు వేసవులు
లెక్కపెట్టలేనన్ని హేమంతా రుతువులు
శిశిర మొచ్చు వేళ లేవు తీరికలు
సంక్రాంతులు సంబరాలు, సంతరించు ఆడంబరాలు

యుగాదుల ఆహ్వానాలు, దీపావళుల ఆర్భాటాలు
పసుపు కుంకుమల వరలక్ష్ములు, పట్టుచీరల దుర్గమ్మలు
మట్టిగాజుల గలగలలు, మట్టెల సవ్వడుల కలకలలు!

బ్రతుకుచక్రపు టిరుసున, చిక్కువడిన చెలికాడు
చరమయాత్రకు సాగువేళ, బ్రతుకులెందుకు మరి శూన్యాలు!?

సారధి వీడిన రథపు పయనాలెటు?
సాగిపోయిన బ్రతుకు మరలి రాదెటూ
సాంప్రదాయపు పేరున సంకెలలదేల
నిన్నటి పుణ్యస్త్రీ, నేడపశకునమేల?

నిన్నటి రంగుల గాజులు నేడు రంగు మాసేన?
నిన్నటి కుంకుమ రేఖ నేడు చెరిగిపోయేన?
నిన్న పసివాడిన మ్రోడు నేడు చిగురులెత్తేను
కాని, నిన్న వీడిన చెలుడు మరలి రాబోడు
కాని స్మృతుల సుగంధాలు భవిత నింపేను
మరి సాంప్రదాయపు తెర మాటున

మనవత ఎటు దాగేను!?

ఆత్మ నిత్యమ్ము, బ్రతుకు సత్యము
మృతి తథ్యము, స్మృతి వరము
సంస్కృతి సంప్రదాయ సిద్ధము
మరి మానసము? మానవతా బద్ధము!

మరుగు పడనివ్వకీ చిన్ని నిజము
చేతనయిన చిందించు ఒక అశ్రు కణము
చేయూత నందింప కాదు బ్రతుకు దుర్భరము
ఏకాంతమయినా, అది భరింప శక్యము

తోవలెన్నయిన కాని, గమ్యమందరి కొక్కటి
ప్రకృతి నేర్పె డు పాఠము నిత్యనూతనము
ప్రతి బ్రతుకు పయనము, కాల నిర్దిష్టము
మానవత్వపు వెలుగు మరుగు పడనీకుము..!! ***

## వృక్షాలు కమ్మని చెప్పండి

కలశపూడి శ్రీనివాస రావు

వంగూరి ఫౌండేషన్ వారు నిర్వహించిన ।5వ ఉగాది రచనల పోటీలలో ద్వితీయ బహుమతి పొందిన కవిత

**నా చిన్ననాటి పెరటి చెట్టు**
చిలకలు వాలే చెట్టు
అన్ని పక్షులని ఆదరించే వృక్షం

పెద్దది, ఎత్తైనది
లోతుగా వేళ్ళూనుకొన్నది
పచ్చనిది, నిండైనది
ఆకుపచ్చదనం విశాలంగా పరచుకున్నది
గట్టిది, గతమెంతో ఉన్నది

శాఖోపశాఖలుగా విస్తరించుకొన్నది

నేటి నా ఇంటిముందు చెట్టు
చిలకలు వాలని చెట్టు
తనని తానూ మరచిన వృక్షం

కొమ్మలు పెరగగానే విరిగిపడి
ఎక్కడెక్కడికో ఎగిరిపోతున్నాయి
కొమ్మలు కొమ్మలైపోతున్నది
వృక్షం నుండి దూరంగా, పరయిగా
తమది కాని నేలమీద
తమని తామూ నాటుకుంటున్నె

బయట ప్రకృతితో యుద్ధం చేస్తున్నాయి
లోని ప్రకృతిని గెలవలేక పోతున్నాయి
వికృతంగా మారుతున్నాయి

లోతైన వేర్లు లేక
నీరందక ఎండిపోతున్నాయి
కాండం శక్తి చాలక
చిన్న చిన్న గాలివానలకే జడిసిపోతున్నాయి
ఉన్న ఆకుపచ్చదనం చాలక
రోజంతా వొళ్ళంతా వంచి కష్టపడున్నాయి

శ్రమకి తట్టుకోలేక వడలి పోతున్నాయి
తోడులేక తల్లడిల్లుతున్నాయి
వంటరితనంతో వణుకుతున్నాయి

పూలు పూయలేక
కాయలు కాయలేక
పళ్ళు లేని ఒక్క మొక్క

తుమ్మెదలు, తేనెటీగలు
పలకరించే పక్షులు
లేక మొక్కవోతున్నది
వృక్షం కాలేక పోతున్నది
దీన్ని చూస్తే
కంటినీరు వెల్లువవుతున్నది
కళ్ళు మూసుకుంటే
మొక్కల మొండేల వనాలు కనిపిస్తున్నాయి
మొక్క అంతరించి పోతుందేమో నన్న బాధ
మెరుపులా తాకుతున్నది పదే.పదే!
ఇలాంటి మొక్కలు మీకూ కనిపిస్తే
మీకు తోచిన సహాయం చెయ్యండి
వృక్షాలు కమ్మని చెప్పండి ***

## వింగ్స్ — కోసూరి రవి కుమార్ , దాచేపల్లి

ఫ్లెక్సీ బ్యానరు కడుతూ
కాలు జారింది
నేల కాన్వాసుమీద
కుంచె ఛిద్రమైన చిత్రం

కళలు
ఇక కలే!
......
సమాధి దగ్గర
తలాపి దీపం ఎప్పుడూ సిద్ధమే
చావు తీగల మీద తుపాకితో
దేశభక్తి సర్కస్

సైనికుడు
నిరంతర మృత్యు సహవాసి
....
ఆరుగాలం
శ్రమించి
అరకొరగా
అమ్ముకుంటున్నాడు

రైతుజీవితం
ఆరని చితి!
....
ఒక్కసారి
కోల్పోతే
తిరిగి
తేవటం కుదరదు

కాలం
నేల ఒలికిన అమృతం!
.....
పిట్టగూడు
ప్రిదిలిపోయింది
హరిత రథం
నేలకుంగింది

కోరికా
ఒక కుంపటే! ***

## అమ్మ ముచ్చట్లు

రాళ్ళపల్లి రామసుబ్బారావు, నెల్లూరు

**అపురూపమమ్మ ఆయమ్మకు**
తన పాపాయి ప్రతి ముచ్చట
బోసినవ్వులొలికిస్తూ వూయలలూగినా
ముంగిళ్ళ పై నేలన దోగాడినా
గోడనో మంచం కోడునో పట్టుకుని
బుడు బుడి అడుగులు వేసినా

బంగారు కొండ చిన్నారి తల్లి
వజ్రాల మూట చిట్టితండ్రి
వూ॰ కొడితే వుగ్గు గిన్నెలు
పిడికిలి తెరిస్తే ముద్దకుడుములు

పలుకులు పలికితే చక్కెర చిలకలు
బోర్లపడితే బొబ్బట్లు
అడుగులు వేస్తే అరిసెలు
పేరంటాళ్ళు పంచి మురిసే ఆ తల్లులు

ఆ తల్లి చందమామ
మనస్సు వెండిగిన్నె
మమత పైడిగిన్నె
చందమామ రావె..జాబిల్లి తేవే..! ***

## ప్రణతులు

సుమిత్ర

ఏ పుణ్య చరణాలు చేరిన యంతనే
పదునాల్గు లోకాలు పరిఢవిల్లు
ఏ పాద ధూళి సోకిన యంతనే నాదు
తనువెల్ల పులకించి తనివి దీరు
ఏ పద పీఠమున హృది నిల్పగ
ఆనంద సంద్రాన అలలు పొంగు
ఏ పద ద్వయమును ఈ చేత తాకంగ
కరతలమ్మంతయు కాంతులీను

అట్టి నీ పదముల కడకు జేరిన యంత
సకల శుభము లమర సౌఖ్యమిచ్చు
పుణ్య సీమల జని పావనంబ య్యెద
ప్రణయులందుకొనుము పుణ్యచరిత ***

## రసరేఖలు

బచ్చోటి శ్రీధర్

ఇది యెదలోని భావన చెలీ!
మనసార వచించి మించు స
మ్మదమును పొంద వేచితిని
మార్దవపూరితమైన గొంతు నా
యెదసొద నీకు తెల్పగలదేని
తరింతును, లేనిచో వ్యధా

హృదయుడనై తపించి నశియింతును
దివ్వెను కీటకమ్మునై!

మంచి పరీమళంబెగయు
మల్లియలెన్నియొ మించి పూసెనీ
యంచితమార్గమందు చెలియా!
యిటు రమ్మొక మారు, నీదు చే
లాంచల సీమలం గదలి యాడుచు
వచ్చు సమీరసౌరభ
మ్మించుక నాకొసంగి తరియింపగ
జేయవె యీ వనమ్ములో

రెక్క విదిల్చి లేచి యటు రివ్వున
సాగినదాకసంబులో
నొక్క కపోతపోతమతులోత్సుకతన్
పరికింతువే చెలీ!
ఎక్కడికైన పోయి చరియింతుమదే క్రియ
నాకసంబులో
చక్కని దివ్యసౌధముల సావిడిలో
పసివారి కైవడిన్ ***

## అన్యమృగం

వసుంధర

**అతడి తెలివి** ఇంద్రప్రస్థ సింహాసనమునకు కొరివి
అతడి ప్రగతి రాజకీయ నేతృత్వమునకు వెలితి
అతడి ఉనికి దారిద్ర్యపు సరళరేఖ కారడుగుల వెనుక
అతడు మనిషి రాజ్యాంగం ఓటు హక్కునిచ్చింది కనుక

అనర్హులు అసమర్ధులు అన్యాయపు బాటలోని అన్యోన్యపు యాత్రీకులు  అవనినేల కోరినచో
ఏనుగు తొండంబున పూలమాల చందంబున అతడి కేల ఓటున్నది

అతడికేల రామాయణ మతడికేల బ్యాంకు ఋణం
అతడికేల ఉపగ్రహం అతడికేల నవోదయం
అతడి తెలివి అతడి ప్రగతి అతడి ఉనికి అంతేనని అంతేనని
రూఢి చేయు ప్రణాళికలు నరమేధ ప్రహేళికలు

జాతి అంతరించకుండ వన్యమృగ సంరక్షణ ఆధునికత
జాత్యంధుల పాలనలో అన్యమృగమాతడైన అదేకదా అతడి కథ

